# కలల సౌరభం



చికాగో ఓహరె అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా విమానం దిగబోతోంది. సీట్ బెల్టుల్ని సక్రమంగా తగిలించుకుని భద్రంగా కూర్చోమని విజ్ఞప్తిచేస్తున్న కోమలమైన స్వరాన్ని వినగానే ప్రయాణీకులు సుదీర్ఘప్రయాణం ముగింపుకు వస్తున్నందుకు హాయిగా నిట్టూర్చారు. కొద్దిసేపట్లో కూతురు సుధను నాలుగు సంవత్సరాల తరువాత చూడబోతున్నాననే సంతోషం సన్నజాజి పరిమళంలా వసుధ హృదయాన్ని అలుముకుంది.

అమెరికా వచ్చి స్థిరపడిన తన అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ముల పిల్లలు, తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవాళ్ళ పిల్లలు గుర్తుకు వచ్చారు. గత ఇరవై ఏళ్ళలో కుటుంబాలకు కుటుంబాలే తరలివచ్చి అమెరికాలో స్థిరపడడం, ముఖ్యంగా కంప్యూటర్ బూమ్‌లో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం, సౌఖ్యవంతమైన జీవితం కోసం అమెరికా వీసాల కోసం ఎగబడడం కళ్ళముందు కదిలింది. తనలాంటి వాళ్ళను బాధించే విషయం ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న అత్యధిక యువతీ యువకుల చూపు అమెరికా వైపే ఉండడం, తమ కలల స్వర్గంలో పాదం మోపడంలో సఫలం కాని ఆశోపహతులు భారతదేశాన్ని తిట్టుకుంటూ గడపటం, తమ దేశంపెట్టిన పెట్టుబడితో ఎదిగిన మానవ వనరు అమెరికా లాభాలకు ఇంధనమవడం. ఈ పరిణామం అనివార్యమా?!

అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న పిల్లల కారణంగా తనకు తెలిసిన కుటుంబాలలో వచ్చిన ఆర్థిక, సామాజిక ఎదుగుదల, జీవనశైలిలో కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలలో వచ్చిన మార్పు గుర్తుకొచ్చాయి. పదిహేను, పదహారేళ్ళ క్రితం పెదనాన్న కొడుకు కేశవన్నయ్య,

**డా॥ ఆలూరి విజయలక్ష్మి**

వదిన అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఇద్దరు కొడుకులు, కోడళ్ళ ఉద్యోగాల గురించి, వాళ్ళ కార్లు, ఇళ్ళు, ఇళ్ళల్లోని రకరకాల వైభవ చిహ్నాల గురించి ఎంతో గొప్పగావర్ణించి చెప్పేవారు. రెండు, మూడు సంవత్సరాలకొకసారి కొడుకులు పంపిన విమానం టికెట్‌తో అమెరికా వెళ్ళొచ్చి ప్రపంచాన్ని జయించిన విజేతల్లాగా గర్వంగా అక్కడి విశేషాల్ని చెప్పేవారు. కాని... ఐదారు సంవత్సరాల నుండి, వయసు మీద

కథ

పడుతున్నకొద్దీ వారి ముఖాల్లో కళ తగ్గిపోసాగింది. వారిలో మునుపటి ఆనందం, గర్వం స్థానంలో దిగులు, భయం, అభద్రత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇన్నేళ్ళుగా తామిద్దరూ, ఇద్దరు కొడుకులు, ఇదే ప్రపంచంగా ఇతరులెవరితోనూ పెద్దగా సంబంధాలు లేకుండా బతికిన వాళ్ళు, ఇప్పుడు కొడుకులు అమెరికాలో, అక్కడ ఇమిడి జీవించలేని తామిక్కడ, ఇక్కడేమైనా అవసరమయితే తమకేదన్నా అయితే ఎవరు దిక్కు అనే నిస్పృహ, దిగులు వాళ్ళ మాటల్లో వున్నాయి.

ఈ పరిణామాలకు అతీతంగా బతకడం కష్టమని కొద్దికాలంలోనే తనకూ అర్థమయింది. తన కూతురు సుధ, అల్లుడు ప్రశాంత్ అమెరికాలో ఉద్యోగాలు వెదుక్కుని తమ ప్రయాణం గురించి చెప్పినప్పుడు తమ అభ్యంతరాల్ని కొట్టిపారేస్తూ తాము దేశాన్ని విడిచి వెళ్ళడాన్ని సమర్థించుకునేందుకు ప్రశాంత్ ముందుకు తెచ్చిన బలమైన వాదాన్ని తను, తన భర్త కలిసి అడ్డుకుని ఆపలేకపోయారు. నాలుగు రోజులు కూడా కూతురిని చూడకుండా బతకలేని తను నాలుగు సంవత్సరాలు సుధ ఎడబాటును ఎలా సహించగలుగుతోందో తనకి ఆశ్చర్యంగా వుంది. ఈ నెలాఖర్లో పుట్టబోతున్న మనవరాలి పుణ్యమా అని ఈ దేశం వచ్చి కూతుర్ని చూడబోతోంది. కూతుళ్ళు, కోడళ్ళ పురుళ్ళు పోయడానికి వచ్చే అనేక వందల మంది భారతీయ స్త్రీలలో తానూ ఒకతి అయి అమెరికాలో కాలిడబోతోంది.

"ఆంటీ! మా అడ్రస్, ఫోన్ నంబర్స్ ఇవి. మీరు ఇండియాకు తిరిగి వెళ్ళేలోగా మా ఇంటికి తప్పకుండా రావాలి" విమానం ఆగాక సీట్ బెల్ట్స్‌ని విప్పుతున్న చప్పుడుతో ఆలోచనలతో నుండి బయటపడిన వసుధ ప్రీతి అందించిన కాగితాన్ని తీసుకుంది.

"మీ సహాయం లేకపోతే నేనేమైపోయేదాన్నో! థాంక్‌యూ ఆంటీ! థాంక్‌యూ సోమచ్!"

ప్రీతి వంక చూస్తూ చిన్నిచిన్ని సహాయాలు, ధైర్యాన్నిచ్చే నాలుగు మంచి మాటలు అపరిచితులైన తమ మధ్య ఎంత ఆత్మీయ బంధాన్ని నెలకొల్పాయి అనుకుంది వసుధ. హైదరాబాద్ నుండి తనతో ప్రయాణించిన ప్రీతి బొంబాయిలో విమానం దిగేసరికి సలసలలాడుతున్న కూతురి శరీరాన్ని తాకి కంగారుపడి బిక్కమొకమేసింది. ఒంటరిగా పసిబిడ్డతో బయల్దేరినందుకు తనను తాను నిందించుకుంటున్న ప్రీతిని ఓదార్చి గగ్గోలుపెట్టి ఏడుస్తున్న బిడ్డను సముదాయించి మందు తాగించి పాలు పట్టింది. విమానంలోనూ, లండన్ హీత్రూ విమానాశ్రయంలో ఆగినప్పుడు ప్రీతితోపాటు వుండి సహాయపడింది. ప్రీతి పదేపదే కృతజ్ఞతలు చెప్తూంటే తను కాకపోతే మరొకరు, ఎవరో ఒకరు సహాయపడేవారు. అసలు ఒకరికొకరు ఆమాత్రం సహాయపడకపోతే ఎలా! అపరిచితులు ఒకరినొకరు పలకరించడం, ఒకరితో ఒకరు చొరవ తీసుకుని మాట్లాడడం నాగరికత కాకపోవటమేమిటసలు! అనుకుంది వసుధ.

బాగేజ్ ట్రాలీని తోసుకుంటూ బయటి లాంజ్‌లోకి వచ్చి తనను తీసుకెళ్ళడానికి రావలసిన తన స్నేహితురాలి అల్లుడు రామానుజం వచ్చాడేమోనని చూపు అందినంతమేర కలయచూచించి వసుధ. సుధ ఉండే ఊరు చికాగోకి మూడుగంటల ప్రయాణంలో వుంది. ప్రశాంత్ అనుకోకుండా తప్పనిసరి పని తగిలి తనను

తీసుకువెళ్ళడానికి రాలేకపోతున్నాడని, చికాగోలోనే ఉంటున్న రామానుజం తనను తీసుకువచ్చి దింపుతాడని సుధ ఫోన్ చేసినప్పుడు చెప్పింది. ఐదారేళ్ళ క్రితం రామానుజం మరదలి పెళ్ళిలో అతన్ని చూసింది. ఇన్నేళ్ళ తర్వాత పోల్చుకోగలమో లేదోనని వసుధ అనుకుంటూ వుండగానే రామానుజం వచ్చాడు.

"బావున్నారా ఆంటీ! ప్రయాణం బాగా బోర్ కొట్టేసిందా?" ఆప్యాయంగా పలకరించాడు రామానుజం.

"బోర్ కాదుకాని కాళ్ళే స్వాధీనంలోకి రానంటున్నాయి" నవ్వుతూ జవాబిచ్చింది వసుధ.

తను తెచ్చిన కోటును వేసుకోమని వసుధకు ఇచ్చి బాగేజ్ ట్రాలీని తీసుకుని లిఫ్ట్ ద్వారా పై అంతస్తుకు వచ్చి బయటకు వెళ్ళే కారిడార్‌లో ఆపాడు.

"ఆంటీ! మీరిక్కడే, ఆ తలుపు లోపలే నుంచోండి. నేను పార్కింగ్ ప్లేస్ నుండి కారు తెస్తాను. బయట విపరీతమైన చలిగా వుంది. మంచు కూడా కురుస్తోంది".

తన చుట్టూ ఉన్న కొత్త ప్రపంచాన్ని కుతూహలంతో చూస్తోంది వసుధ. ఎన్ని ఖండాలు, ఎన్ని దేశాలు, జాతులు, భాషలు, ఎన్నెన్ని సంస్కృతులకు చెందినవారి కలల కేంద్రమయిందీ దేశం!... కాని... ఈ దేశమే తనను తాను ప్రపంచాధినేతగా ప్రకటించుకుని, విరసెత్తి ప్రతిఘటించిన ప్రతి దేశపు కలల్నీ కూలదోయడం, కూలిన ఆ కలల చితాభస్మంలోంచి పుట్టుకొచ్చిన ఉగ్రవాదులు తనపైనే గురిని ఎక్కుపెట్టినప్పుడు పిచ్చెక్కిన కోతిలా గెంతి ఉగ్రవాద నిర్మూలన పేరిట దేశాల్నే స్మశానాలుగా మార్చి పీడకలల్ని మాత్రమే మిగల్చటం... వికృత ధ్వంస రచన... విచిత్ర సంస్కృతి-వసుధ మెదడులో ఒకవిధమైన అలజడి, వ్యక్తపరచలేని సంచలనం.

చికాగో వీధుల్లో వెళ్తూంటే వసుధకు స్వామి వివేకానంద, చికాగోలో జరిగిన పార్లమెంట్ ఆఫ్ రిలిజియన్స్‌లో శ్రోతల హృదయాల్ని తట్టిన ఆయన సంబోధన, సభికుల్ని మంత్రముగ్ధుల్నిచేసిన ఆయన ప్రసంగం గుర్తుకువచ్చాయి. పత్రికల ద్వారా పరిచితులైన చికాగో నివాసి, ప్రసిద్ధ చిత్రకారులు రామారావుగారు గుర్తొచ్చారు. క్రమేపీ అమెరికా రక్తసిక్త చరిత్ర, రక్తపుటేరుల్ని పారిస్తున్న వర్తమానపు జాడలు స్మృతుల దొంతర్ల అడుగుకు జారి వసుధ స్థిమితపడుతోంది.

"ఆంటీ! ఇప్పుడు మనం మా ఇంటికి వెళ్తున్నాం. మీరీపూట మాతో గడిపితే సుమతి కూడా సంతోషపడుతుంది. మా బాబునీ చూడలేదుకదా మీరు. రేపు ఉదయమే బయల్దేరి సుధ దగ్గరకు వెళ్దాం" వెంటనే సుధ దగ్గరకు వెళ్ళలేకపోవటం కొంచెం ఆశాభంగం కలిగించినా ఇంత రాత్రిపూట ఈ మంచులో డ్రైవ్ చేసి తీసుకెళ్ళమని అడగటం భావ్యం కాదనిపించింది వసుధకు. అదీగాక సుమతి, ఆమె కొడుకుతో గడపటం తనకు ఆనందం కలిగించే విషయమే కనుక వెంటనే అంగీకరించింది.

అగ్నిపుష్పాలు దొర్లుకుపోతున్నట్లుగా వున్నాయి పరుగెత్తుతున్న కార్ల లైట్లు. అమెరికాలోని విశాలమైన రహదారులు, దారిని తెలిపే ఏరియా సిగ్నల్స్, భారీ భవంతులు, షాపింగ్ మాల్స్ గురించి వినే వున్నప్పటికి ఆసక్తిగా గమనించసాగింది వసుధ. కారులోనుంచే, ఇం

> **వసుధకు రామానుజం, సుమతి కొసరికొసరి వడ్డించిన అసలుసిసలు తెలుగు భోజనం అమృతప్రాయంగా అనిపించింది. అంతకంటే ఎక్కువగా పదేళ్ళకు పైగా అమెరికాలో నివసిస్తున్నప్పటికి తెలుగునాట జీవిస్తున్నవారికంటే స్వచ్ఛమైన తెలుగును మాట్లాడడం, కొడుకుతో కూడా తెలుగులోనే మాట్లాడడం వీనులవిందు చేసింది.**

కా అంత దూరంలో వుండగానే రిమోట్‌తో కారు గరాజ్‌ని తెరవడం, కారు సరాసరి గరాజ్‌లోకి వెళ్ళడం సరదాగా అనిపించింది.

సుమతి కారు దగ్గరకు వచ్చి ఆప్యాయంగా వసుధ చెయ్యి పుచ్చుకుని ఇంట్లోకి తీసుకువెళ్ళింది. కొత్తగా చూస్తున్న అవినాష్‌ని దగ్గరకు పిలిచి పలకరించింది వసుధ. చలి నుంచి రక్షణ కోసం వసుధ ధరించిన కోటు, బూటు, గ్లవ్స్ వగైరాల్ని విప్పి సోఫాలో స్థిమితంగా కూర్చునేసరికి రామానుజం వేడివేడి కాఫీని కలిపి ముగ్గురికి తీసుకువచ్చాడు. కంప్యూటర్ ముందు కూర్చుని ఆడుతున్న కొడుకును బుజ్జగించి త్వరగా అన్నం తిని నిద్రపోవడానికి ఒప్పించాడు. అవినాష్‌కి అన్నం పెట్టడానికి లేస్తున్న సుమతిని వారించి ఆంటీతో కబుర్లు చెప్పమని చెప్పి తనే కొడుక్కి అన్నం తినిపించాడు. గెస్ట్‌రూమ్‌లో రూమ్ హీటర్‌ని ఆన్‌చేసి వసుధ స్నానం చేయడానికి అన్నీ సిద్ధం చేసి వచ్చాడు.

"ఆంటీ! ముందు స్నానం చేసిరండి. భోజనం చేసాక కబుర్లు చెప్పుకుందాం." వసుధ క్యారీబాగ్‌ని గెస్ట్‌రూమ్‌లో పెడుతూ అన్నాడు రామానుజం. తను మొహమాట పడడానికి వీల్లేనివిధంగా రామానుజం చనువుగా ప్రవర్తించడం వసుధకు ఆనందం కలిగించింది.

వసుధ స్నానం చేసి వచ్చేప్పటికి సుమతి వడియాలు వేపుతూంటే రామానుజం మైక్రోవేవ్‌లో కూరల్ని వేడిచేస్తున్నాడు. ఎయిర్ ఇండియా వారి ఆహారంతో జిహ్వ చచ్చిపోయిన వసుధకు రామానుజం, సుమతి కొసరికొసరి వడ్డించిన అసలుసిసలు తెలుగు భోజనం అమృతప్రాయంగా అనిపించింది. అంతకంటే ఎక్కువగా పదేళ్ళకు పైగా అమెరికాలో నివసిస్తున్నప్పటికి తెలుగునాట జీవిస్తున్నవారికంటే స్వచ్ఛమైన తెలుగును మాట్లాడడం, కొడుకుతో కూడా తెలుగులోనే మాట్లాడడం వీనులవిందు చేసింది.

భోజనమయ్యాక కబుర్లలో రామానుజం, సుమతిల ఉద్యోగాల విశేషాల్ని గురించి అడిగింది వసుధ.

"మంచి ఉద్యోగంలో స్థిరపడేదాకా పిల్లలు వుడితే సరిగ్గా చూసుకోలేమని వాయిదా వేసాం. తీరా కావాలనుకునేటప్పటికి పిల్లలు పుట్టడం కష్టమయింది. రకరకాల పరీక్షలూ, మందులూ, హార్మోన్ ఇంజక్షన్లు, వాటి సైడ్ ఎఫెక్ట్స్, నెలనెలా పీరియడ్ రాగానే ఇద్దరం విపరీతమైన డిప్రెషన్‌కి లోనయ్యేవాళ్ళం. తరువాత రెండుసార్లు గర్భం వచ్చి కూడా నిలవకపోవడం... నరకమనుభవించాననుకో పెద్దమ్మా! ఇంక బాబు కడుపున పడిన దగ్గర్నుండి



బాబు పుట్టాక వాడిని పెంచేవాళ్ళు లేక, బేబి సిట్టర్ దగ్గర వదలటానికి మనసొప్పక మళ్ళీ జాబ్‌లో చేరలేదు. ఉద్యోగంలో పైస్థాయికి చేరుకోవడానికి మంచి అవకాశాలొస్తున్న దశలో అసలు జాబ్‌నే మానేయవలసి వచ్చింది" బాధగా అంది సుమతి. గర్భం, ప్రసవం, పిల్లల సంరక్షణ స్త్రీలు చదువు, వృత్తి, ఉద్యోగాల్లో ఉన్నతస్థితికి చేరకుండా ఎలా ఆటంకపరుస్తున్నాయనేది సామాన్యంగా చూస్తున్న విషయమే కనుక అంత అసహజమనిపించలేదు. గర్భం, ప్రసవం సరే 'పిల్లల సంరక్షణ' అనేది కేవలం ఆడవాళ్ళ బాధ్యతేనని ఇంత అభివృద్ధి సాధించిన ఆధునిక సమాజం కూడా ధృవపరుస్తుందా లేక ఇది భారతీయ సంతతికి మాత్రమే పరిమితమయిన ప్రత్యేక పరిస్థితా? అనుకుంది వసుధ.

"ఇంతకాలం జాబ్ మానేసి ఇంట్లో ఉండడం అంత సులభంకాలేదు. 'కెరీర్' పరంగా నేను సాధించదలచుకున్న లక్ష్యంవేరు. జీవితంలో జరుగుతున్నది వేరు. విపరీతమైన సంఘర్షణ. ఇంతలో అనుకోకుండా ఫామిలీ ప్లానింగ్ మెథడ్ ఫెయిలయ్యి మళ్ళీ గర్భం వచ్చింది. ఏం చెయ్యాలో పాలుపోక, ఏదో ఒకటి నిర్ణయించుకునేలోగా ఒకరోజు రామూ ఆఫీసుకు వెళ్ళిపోయాక అకస్మాత్తుగా బ్లీడింగ్ అవటం మొదలుపెట్టింది. రామూకు అంబులెన్స్ కోసం హాస్పటల్‌కు ఎలా ఫోన్ చేసానో తెలియదు. అంబులెన్స్ వచ్చేసరికి స్పృహ లేకుండా రక్తపుమడుగులో పడివున్న నేను, నామీద పడి దిక్కులేనివాడిలా నా కొడుకు ఏడుపు. అదే దృశ్యం నా కళ్ళముందు పదేపదే కదిలేది." ఆ అనుభవం తాలూకు విహ్వలత సుమతి స్వరంలో ధ్వనించింది.

"ఆ రోజుల్ని తలచుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది ఆంటీ! సుమతి హిస్టీరికల్‌గా అయింది. కొన్నిరోజులు ఇండియా పంపిద్దామంటే వెళ్ళొచ్చి ఆరునెలలైనా కాలేదు వెళ్ళనని మొండికేసింది."

"అమ్మని వచ్చి కొన్నాళ్ళు ఉండమనలేకపోయావా?" సుమతి వంక చూస్తూ అంది వసుధ.

"బాబు పుట్టినప్పుడు అమ్మానాన్నా వచ్చారు. ఈవాతావరణం అమ్మకు పడలేదు. ఉన్నన్నాళ్ళు ఉబ్బసంతో బాధపడింది. మళ్ళీ అమ్మను కష్టపెట్టడం ఇష్టంలేక, తెలిసికూడా రాలేకపోతే ఇంకా బాధపడతారని వాళ్ళకేమీ చెప్పలేదు. కాని... అయినవాళ్ళ సేఫ్టీనెట్ లోటు బాగా అనుభవమయింది. ఆ సమయంలో రామూ నాకంతగా ఎమోషనల్ సపోర్టివ్వకపోతే ఇంత త్వరగా కోలుకోగలిగి వుండేదాన్ని కాదు." భర్తవంక చూస్తున్న సుమతి కళ్ళల్లో కృతజ్ఞత, ప్రేమ తొణికిసలాడాయి. బంధువులు, స్నేహితుల సహాయం, సపోర్టు విలువైనవే, కాని... భార్యాభర్తలు ఒకరికొకరు మానసిక ఆసరాఇవ్వగలిగితే, ఒకరి దుఃఖాన్ని మరొకరు సహానుభూతితో పంచుకోగలిగితే ఎంతటి కష్టాన్నీ అవలీలగా దాటగలరని సుమతి నిరూపిస్తుంది. దురదృష్టవశాత్తు భార్యాభర్తల మధ్య అంతటి అపురూపమైన అనుబంధమెక్కడ వుంటుంది! అరుదుగా తప్ప, భార్యాభర్తల మధ్య వుంటున్నవి అధికార సంబంధాలేకాని ఆత్మీయ బంధాలు కావు కదా! చదువు, మేధస్సు, సంపాదన ఎంత ఉన్నప్పటికి భార్యలుగా కుటుంబంలో అధీనులుగా లొంగివుండమనే అన్ని సమాజాలూ శాసిస్తున్నాయి.... వసుధలో ఆలోచనల వలయాలు.

**ఇందులో నాలుగోవంతు ప్రేమనీ, గౌరవాన్నీ భార్యలు పొందగలిగితే ఇంతింత హింస, అవమానామూ స్త్రీలు ఎదుర్కోవలసిన పరిస్థితి వుండేదా! ఆడవాళ్ళ ఆలోచనల పట్ల, అనుభూతుల పట్ల, కలవరాల పట్ల ఇంత చిన్నచూపు ఉందా!! అనేక రకాల అసమానతలున్న సమాజాల్లో, అసమానతల్లోనే పెరిగే స్త్రీ, పురుషుల మధ్య ఇంతకంటే మెరుగైన సంబంధాల్ని ఆశించడం కూడా అత్యాశేనేమో!**

"ఉద్యోగానికి వెళ్ళకపోతే గడవని పరిస్థితి. వెళ్తే ఇంటికి వచ్చేవరకు సుమతి, బాబు ఎలా ఉన్నారోనని దిగులు, నేను కూడా దిగులుతో క్రుంగిపోతే సుమతి పరిస్థితి మరింత అధ్వాన్నమవుతుందేమోననే భయం. నన్ను నేను కూడదీసుకోవటానికి చాలా శ్రమపడాల్సి వచ్చింది." గడిచిపోయిన గడ్డురోజుల నీడలు రామానుజం కళ్ళల్లో కదిలాయి. ఇందులో నాలుగోవంతు ప్రేమనీ, గౌరవాన్నీ భార్యలు పొందగలిగితే ఇంతింత హింస, అవమానామూ స్త్రీలు ఎదుర్కోవలసిన పరిస్థితి వుండేదా! ఆడవాళ్ళ ఆలోచనలపట్ల, అనుభూతుల పట్ల, కలవరాల పట్ల ఇంత చిన్నచూపు ఉందా!! అనేక రకాల అసమానతలున్న సమాజాల్లో, అసమానతల్లోనే పెరిగే స్త్రీ, పురుషుల మధ్య ఇంతకంటే మెరుగైన సంబంధాల్ని ఆశించడం కూడా అత్యాశేనేమో! అనుకుంది వసుధ.

"సారీ ఆంటీ! రాకరాక మీరు మా ఇంటికి వస్తే మా కష్టాల్ని, సమస్యల్ని చెప్పి మిమ్మల్ని బాధపెట్టాం."

మౌనంగా ఆలోచిస్తున్న వసుధ తెప్పరిల్లి తనకిరువైపులా కూర్చున్న సుమతి చేతినీ, రామానుజం చేతినీ ఆప్యాయంగా అందుకుంది.

"మీదోపాటు మామయ్య కూడా వస్తే బావుండేది" వసుధ స్పర్శ ప్రవహింపజేస్తున్న ఆత్మీయతను గుండెలోకి స్వీకరిస్తూ అన్నాడు రామానుజం.

"ఆయన రావడం కష్టం బాబూ! రిటైర్ అవకముందు స్కూలు మాస్టరు ఉద్యోగమొక్కటే. కాని రిటైరయినాక ఊపిరి సలపని పనుల్ని పెట్టుకున్నారు. ఉద్యోగం చేస్తున్నంతకాలం 'ఉపాధ్యాయుడు కేవలం పాఠాలబోధకుడుగా మిగిలిపోకూడదు. విద్యార్థి సర్వతోముఖ వికాసానికి బాధ్యత వహించి కృషిచెయ్యాలి' అనే తత్త్వాన్ని మనసావాచా నమ్మి ఆచరించారు. ఇప్పుడు... మనం స్వంత ఇంటిని చక్కదిద్దుకోవటానికి, అభివృద్ధిపరచుకోవటానికి ఎంత శ్రమపడతామో అంతటి దీక్షతోనూ మన ఊరిని అభివృద్ధి పరచుకోవడానికి కృషి చెయ్యాలంటారు."

"అమ్మ చెప్పింది- పెదనాన్న మీ ఊరి స్కూలు రూపురేఖల్నే మార్చేసారని" అంది సుమతి.

"మేము హైస్కూల్లో చేరకముందు, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో కట్టిన మా హైస్కూలు షెడ్డులు శిథిలమైపోయాయి. మెయిన్ బిల్డింగ్ కూడా బీటలుపడి గట్టిగా వర్షం వస్తే కారిపోతుంది. మరమ్మతులు చేయటానికి నిధుల్లేక, పట్టించుకునే నాధుడులేక పిల్లలు అవస్థలు పడుతూనే చదువుతున్నారు. ఇప్పుడు వాటిని బాగుచేయించి బిల్డింగ్‌పైన మరొక స్లాబ్ వేయించి గదులు కట్టించారు. బల్లలు, డెస్క్‌లు, సైన్స్ లాబ్‌కి కావలసిన పరికరాలు, చక్కటి లైబ్రరీ అమర్చారు. అక్రమ ఆక్రమణల్లోవున్న స్కూలు ప్లేగ్రౌండ్‌ని విడిపించి చిన్నప్పుడు



మేం ఆడుకున్నప్పటి కంటే ఎక్కువ సౌకర్యాల్నీ, ఎక్కువ గేమ్స్ ఆడుకోవటానికి కావలసిన కోర్ట్స్‌ని ఏర్పాటుచేసారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, దాతలు... అందరిచుట్టూ తిరిగి అనుమతుల్ని పొంది, నిధులు సేకరించి, అవి జాగ్రత్తగా వినియోగమయేలా చూసారు. ముందు ఆయన ప్రతిపాదనల్ని విని ఎద్దేవా చేసిన వాళ్లూ, 'మన వల్లెక్కడవుతుంది!' అంటూ వెనక్కు లాగినవాళ్ళూ కొంత పనవడం మొదలయేసరికి నమ్మకం కలిగి కలిసొచ్చారు" వసుధ స్వరంలో భర్త కృషిపట్ల సంతోషం, సంతృప్తి, ప్రశంస.

"బావుంది ఆంటీ! మామయ్యగారి ఈ గొప్ప వ్యాపకం గురించి ఇప్పుడు మీరు చెప్పేదాకా తెలియదు" సంతోషంగా అన్నాడు రామానుజం.


"ఇప్పుడు చుట్టుపక్కల పది, పదిహేను గ్రామాలకు ఉపయోగపడేలాగా మండల కేంద్రమైన మా గ్రామంలో కనీసం పాతిక పడకల హాస్పటల్‌ని కట్టించాలని సంకల్పం. భూమినీ, ఆకాశాన్నీ కదిలిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా ఎంత మేరకు చేయించుకోవచ్చో తెలుసుకుంటున్నారు. మా ఊళ్ళోనూ, పక్క ఊళ్ళల్లోనూ పుట్టిపెరిగి మా హైస్కూల్లో చదువుకుని దేశంలోనూ, విదేశాల్లోనూ ఆర్థికంగా ఉన్నతస్థానంలో వున్నవాళ్ళందరినీ నిధుల కోసం కదిలించారు."

"అవసరమైన ఫండ్స్ సమకూడాయా?" ఉత్సాహంగా అడిగాడు రామానుజం.

"అంత సులభంగా వస్తాయా?! 'ఎందుకంత బలవంతం చేస్తారు, వాళ్ళేదో రుణపడి వున్నట్లు?!' అంటే 'జీవితంలో పైకి వచ్చినవాళ్ళమంతా కేవలం మన తెలివితేటలు, ప్రతిభ, కృషివల్లే పైకి వచ్చామనుకుంటాం. కాని, వీటికి అనేకమంది మనకు తెలిసీ, తెలియని వ్యక్తుల కృషి కూడా తోడయితేనే మనమిది సాధించగలుగుతామని పెద్దలు చెప్పే వాస్తవాన్ని ఒప్పుకోం. మనం కొంచెం అహాన్ని వదిలించుకుని ఆలోచిస్తే కుటుంబానికి, ఊరికి, సమాజానికి ఎంత రుణపడి వున్నామో అర్థమవుతుంది' అంటారాయన. ఎవరికైనా తను చెప్పేదే వేదంకదా!" చిన్నగా నవ్వింది వసుధ.

"నిజమే ఆంటీ! మన ఉన్నతికి కేవలం మనమే కారకులమనుకుంటే అంతకంటే పెద్ద మూర్ఖత్వం మరొకటుండదు. మామయ్యగారి భావాలు వింటూంటేనేను ఎమ్.ఎస్. చేయడానికి అమెరికాకు బయల్దేరేముందు మా అమ్మ చెప్పిన మాటలు గుర్తొస్తున్నాయి- 'మన కడుపుకు మనం ఎంతతిన్నా విలువేముంది? నీకు పది ముద్దలుంటే ఒక ముద్దన్నా పక్కవాడికి పెట్టు. ఆ ఒక్కముద్దకే విలువెక్కువని మరిచిపోకు నాన్నా!' అని చెప్పింది. అది విని నాకు నోటమ్మట మాటరాలేదు. ఉమ్మడి కుటుంబంలో నాన్నగారి నీడలో నిశ్శబ్దంగా పనిచేసుకుపోవటమే తప్ప తన ఇష్టాయిష్టాల్ని ఎన్నడూ వ్యక్తపరచని అమ్మ, 'అమ్మకేమీ తెలియదు. ఒఠ్ఠి అమాయకురాలు' అని మేమంతా పెద్దగా లెక్కచేయని అమ్మ నోటివెంట వచ్చిన మాటలు ఆమె గురించి నా అవగాహనను తారుమారు చేసాయి." భావోద్వేగంతో చలించింది రామానుజం స్వరం. అమ్మల తెలివి, భావాల వ్యక్తీకరణను అణచివేస్తున్న శక్తుల ప్రాబల్యం గురించి ఆలోచిస్తోంది వసుధ.

"పెద్దమ్మా! మాటల్లో పడి మరిచిపోయాను. సుధకి ఫోన్ చేసి మాట్లాడు" సుమతి కార్డ్‌లెస్ ఫోన్‌ని వసుధ చేతిలో పెట్టింది.



"మామయ్యగారికి కూడా ఫోన్ చేసి మీరు క్షేమంగా చేరినట్లు చెప్పండి ఆంటీ!" సుధతో మాట్లాడాక వసుధ అవసరంలేదని వారిస్తున్నా వినకుండా ఫోన్ నంబర్ తెలుసుకుని డయల్ చేసి ఇచ్చాడు రామానుజం.

"నేను ఫోన్ చేస్తే ఏం బావుంటుంది?... సరేలెండి... అలాగేలెండి... అలాగేనన్నాగా... చేస్తాను... వుంటాను" అయిష్టంగా అంగీకారం తెలుపుతూ ఫోన్ పెట్టేసింది వసుధ.

"ఏంటి పెద్దమ్మా? ఏమంటున్నారు పెదనాన్న??"

"మీ పెదనాన్న చిన్ననాటి స్నేహితుడు, క్లాస్‌మేట్ ఇక్కడ బోస్టన్‌లో కార్డియాలజిస్ట్, మల్టీమిలియనీర్. డా.శ్రీనివాస్‌కి స్వంత విమానం వుందని, కొన్ని దీవుల్ని కొన్నాడని, ఆయన ఇల్లు ఇంద్రభవనంలా రంగరంగ వైభోగంగా వుంటుందని, ఆయన ఇంటి గోడలకు, షాండిలియర్స్‌కు, సింకులకు బంగారుపూత పూసి వుంటుందని, ఇంటిచుట్టూ కొన్ని ఎకరాల ఆహ్లాదకరమైన తోట, పడవల్లాంటి కార్లు... ఇలా ఆయన సంపద గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు మా ఊళ్ళో. ఆయన మా ఊరి వాడయినందుకు గర్విస్తారు మా ఊళ్ళో కొంతమంది. ఇలాంటి వైభవాలన్నీ పరిచితమే కనుక సుమతికీ, రామానుజానికీ వసుధ చెప్పింది ఆశ్చర్యం కలిగించలేదు. అంతటి శ్రీమంతుడు బహుశా పెద్ద మొత్తమే విరాళంగా ఇచ్చివుంటాడు అనుకున్నాడురామానుజం.

"ఫిర్యాదుగా చెప్పటంలేదు పెద్దమ్మా! నాకూ ఇష్టమే... తను ఇండియా వెళ్ళినప్పుడల్లా ఊరికి ఏదో ఒక సహాయం చేసి రావాలని తాపత్రయపడతారు. అందుకోసం తన అవస రాల్ని త్యాగంచేసి పొదుపు చేస్తారు. మొన్నటిసారి ఊరికి వెళ్ళినప్పుడు..."

"డా. శ్రీనివాస్‌ని స్కూల్‌కోసం విరాళమడిగితే ఇస్తాను ఇస్తాను అన్నారుకాని చివరకు ఇవ్వలేదు. ఏదో ఇబ్బంది చెప్పి దాటేసారు. ఈసారి హాస్పటల్‌కన్నా ఇవ్వమని క్రితంసారి ఆయన ఇండియా వచ్చినప్పుడు ఆయన బందరులో ఉన్నారని తెలిసి పనిగట్టుకుని వెళ్ళి మరీ అడిగొచ్చారు. ఇప్పుడాయన ఫోన్ నంబర్స్‌ని నా ఫోన్ పుస్తకంలో రాసారట, చూసి ఆయనకు ఫోన్ చేసి గుర్తుచేయంటున్నారు. నేను అడిగితే ఏం బావుంటుంది చెప్పమ్మా!"

"ఫోన్ చెయ్యి పెద్దమ్మా! ఏం ఫరవాలేదు"

"తప్పేం వుంది ఆంటీ! ఒకసారి ఫోన్‌చేసి గుర్తుచెయ్యండి. అక్కడ వాగ్దానం చేసినా ఇక్కడకు వచ్చాక తమ పనుల్లోపడి మరిచిపోవచ్చు. ఏదీ నంబర్ వెతకండి. ఇప్పుడే చేసేద్దాం" నంబర్ తీసుకుని డయల్ చేసి ఫోన్‌ని వసుధకి ఇచ్చాడు రామానుజం. ఇంతలో సెల్‌లో తనకి కాల్ వస్తే కొంచెం అవతలికి వెళ్ళి మాట్లాడుతున్నాడతను. డా. శ్రీనివాస్‌తో మాట్లాడి నిరుత్సాహంగా ఫోన్‌ని పెట్టేసింది వసుధ. ఫ్రిజ్‌లోని ఫ్రూట్‌సలాడ్‌ని తీసి కప్పుల్లో పెట్టి తీసుకొచ్చింది సుమతి.

"ఈయన కూడా పెదనాన్నలాగానే పెద్దమ్మా! ఎప్పుడూ వాళ్ళూరి ధ్యాసే" అంది సుమతి.

"పట్నంలో పుట్టి పెరిగినదానివి మరి 'ఊరి ధ్యాస' కొంచెం విచిత్రంగానే కనిపిస్తుంది నీకు" పరిహాసం చేసింది వసుధ.

"ఫిర్యాదుగా చెప్పటంలేదు పెద్దమ్మా! నాకూ ఇష్టమే... తను ఇండియా వెళ్ళినప్పుడల్లా ఊరికి ఏదో ఒక సహాయం చేసి రావాలని తాపత్రయపడతారు. అందుకోసం తన అవసరాల్ని త్యాగంచేసి పొదుపు చేస్తారు. మొన్నటిసారి ఊరికి వెళ్ళినప్పుడు..." సెల్‌ని ఆపి వచ్చిన రామానుజం అందుకున్నాడు.

"అంత పెద్ద విశేషమేమీ లేదు ఆంటీ! ఏదో ఒకటి చెయ్యాలనే తపన. కాని... చెయ్యడమెంత కష్టమో అనుభవమే. అంతకుముందు మా ఊరి లైబ్రరీకి పుస్తకాల్ని కొనివ్వటం, కొంతమంది పేద విద్యార్థుల చదువుకు సహాయపడడం, మంచినీటి చెరువుకు పూడిక తీయించటానికి కొంత డబ్బు సర్దటం... అలాంటి చిన్నచిన్న సహాయాలే. వ్యక్తులుగా మనం చెయ్యగలిగేది చాలా స్వల్పమే. కాని ఆ స్వల్పమే మంచి సంకల్పంతో చేస్తే ఎంతో కొంత పాజిటివ్ ప్రభావంతో కొంతమందికైనా ఉపయోగపడుతుంది. అందుచేత 'నా ఒక్కరివల్లా ఏమవుతుంది?' అంటూ ఏమీ చెయ్యకుండా చేతులు కట్టుకు కూర్చోవడం పొరపాటని నా అభిప్రాయం. మరి నా అభిప్రాయం తప్పో, రైటో!"

"తప్పని ఎవరంటారు? ఒకవేళ అన్నా మీరూరుకుంటారా! వాళ్ళతో యుద్ధం చెయ్యరూ!!" భర్తను హాస్యం పట్టిస్తూ అంది సుమతి.

"క్రితంసారి ఇండియా వచ్చేముందు ఏదన్నా కొంచెం పెద్ద ప్రాజెక్ట్‌ని, పదిమందికీ పనికొచ్చేదాన్ని చెయ్యాలనుకున్నప్పుడు నాకు గుర్తుకువచ్చింది మా ఊరి హైస్కూల్లో నాతో

పాటు చదువుకున్న ఆడపిల్లలు" రామానుజం వంక ఆశ్చర్యంగా చూసింది వసుధ. తన ధోరణిలో తను చెప్పుకు పోతున్నాడతను.

"వాళ్ళంతా ఊరికి ఒక చివరన ఉన్న స్కూలుకు వచ్చాక ఇంటికి వెళ్ళే లోగా బాత్రూమ్ అవసరమొస్తే ఎలా? అన్న ప్రశ్న నన్ను చాలా బాధించేది."

స్కూలు టీచర్‌గా పనిచేస్తున్న వసుధకు స్కూలులో ఆడపిల్లలతోపాటు, ఉపాధ్యాయినుల బాధాకరమైన అనుభవాలు పరిచితమే. స్కూల్స్‌లోనేకాదు, అనేక ఆఫీసుల్లోనూ, ఇతర పనిచేసే ప్రదేశాల్లోనూ మహిళా ఉద్యోగులు టాయిలెట్ సౌకర్యంలేక, ఒకవేళ ఒకచోటా, అరచోటా ఉన్నా మగవాళ్ళ ముందునుండి, వాళ్ళ చూపుల్ని ఎదుర్కొంటూ వెళ్ళలేక వారెంత హింస పడతారో, ఎంత అవమానపడతారో ముఖ్యంగా పీరియడ్స్ టైమ్‌లో ఎంత ఒత్తిడికి, భయానికి, సిగ్గుకు లోనవుతారో, మూత్రవ్యవస్థ, జననాంగ వ్యవస్థల ఇన్ఫెక్షన్స్‌కి ఎలా గురవుతారో ఎవరు అర్థం చేసుకుంటారు? మహిళలకు సంబంధించిన ఇంత ముఖ్యమైన అంశం విదేశంలో ఉన్న ఈ యువకుడి హృదయాన్ని కలవరపరచడం ఎంత ఆశ్చర్యం! అనుకుంది వసుధ.

"అప్పుడు చిన్నతనం. ఏమీ చెయ్యలేనితనం. ఆడపిల్లల్ని ఆ విషయంలో కూడా హేళనచేసి ఏడిపించే మగపిల్లల్ని వారించలేని చేతకానితనం" అతని గొంతులోని వేదన, నిజాయితీ వసుధను ఉద్వేగపరుస్తున్నాయి. ఈనాటి యువతీ యువకులు తమ సుఖసంతోషాల గురించి, తమ అభివృద్ధి గురించే తాపత్రయపడతారు తప్ప పక్కవారి గురించి, చుట్టూవున్న సమాజం గురించి బొత్తిగా పట్టించుకోరు అనే సామాన్యీకరణ తప్పు. బతుకులోని రాక్షస పోటీ కొంత వారినలా మారుస్తూందేమోకాని ఆదర్శాలు, కలలు యువత సజీవ లక్షణం. ప్రాథమిక స్వభావం అనే తన వాదనను బలపరుస్తున్నాడితను.

"వాళ్ళ స్కూల్లో ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా మరుగు ఉండేలాగా మూడు టాయిలెట్స్‌ని పక్కగా కట్టించి, పైపులు, మోటారు వేయించారు. టాయిలెట్స్‌ని శుభ్రంగా ఉంచేందుకు, మోటార్‌ని, పైపుల్ని కండిషన్లో ఉంచేందుకు ఏర్పాట్లు చేసి వచ్చారు." సుమతి మాటలు వింటున్న వసుధకు అంతకుముందు తనతో మాట్లాడిన డా. శ్రీనివాస్ చెప్పింది గుర్తుకొచ్చింది. హాస్పటల్ నిర్మాణానికి తను వాగ్దానం చేసిన రెండులక్షల్ని ఇవ్వడానికి తన భార్య ఒప్పుకోవడంలేదని, వెంకటేశ్వరాలయం రిపేరు నిమిత్తం మాత్రం ఇరవై వేలివ్వమంటూందని చెప్పాడు. వరకట్న బేరాలకు, కట్నకానుకల కోసం కోడళ్ళని వేధించేందుకేకాక ఇలాంటి సాకుల్తో వాగ్దానాల్ని పక్కనపెట్టి తప్పించుకోవడానికి కూడా భార్యలు ఉపయోగపడతారన్నమాట! అనుకుంది వసుధ.

"మా ఊర్లో నా ఫ్రెండ్స్ కొంతమంది కూడా సహాయపడ్డారు. జన్మభూమి నిధుల్నించి కొంత డబ్బును మాచింగ్‌గా తేగలిగాం. ఊరి రాజకీయాల్తో కొంతమంది అడ్డుపుల్లలేయడానికి ప్రయత్నించినా తట్టుకుని పూర్తి చేయగలిగామంటే అది పదిమంది నిలబడడంవల్లే సాధ్యమయింది." రామానుజం కళ్ళల్లోని వెలుగు గదినిండా పరచుకున్నట్లనిపించింది వసుధకు.

"వేల మిలియన్ల డాలర్ల అప్పుతో రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికల్లో ఆడవాళ్ళకు చోటులేకపోవడం, వారి గౌరవం, హుందాతనానికి సంబంధించిన ప్రాథమిక అవసరాల్ని తీర్చగల కార్యక్రమాల ఊసేలేకపోవడం, ఒకవేళ ఉన్నా వాటి దృష్టి ఓట్లు, ఎన్నికలమీద మాత్రమే ఉండటం... ఎంత బాధాకరం!" వసుధ కనురెప్పలు అస్థిమితంగా కదిలాయి.

"మా మండలంలోని చాలా స్కూల్స్‌లో మాస్కూల్లో ఉన్న పరిస్థితే. కనీసం ఆ స్కూల్స్ అన్నిటిలో, ఆ తరువాత పక్క మండలాల్లోని స్కూల్స్‌లో ఇలాంటి ఏర్పాటు చెయ్యాలని నా కల ఆంటీ! అనేక కలల్తో ఈ దేశానికి వచ్చి స్థిరపడిన నా ఫ్రెండ్స్‌ని, మా జిల్లాలోనూ, పక్క జిల్లాల్లోనూ మూలాలు ఉన్నవాళ్ళని నా కలను పంచుకుని చేయూతనివ్వమని పోరు పెడుతున్నాను." రామానుజం ఆలోచనల్లోని మానవీయ స్పర్శతో ఉత్తేజితురాలవుతున్న వసుధ దృష్టి టి.వి మీద చక్కని ఫ్రేమ్‌లో నిలిపిన స్వామి వివేకానంద చిత్రం, చిత్రం కింద రాసి ఉన్న వాక్యాల మీద పడింది.

"మీ హృదయాలను ప్రపంచమంత విస్తృతం చేసుకోండి. అపుడు మహాశక్తి మీ వెనుక ఉంటుంది. ఇతరుల కోసం చేసే అతి స్వల్ప కార్యం కూడా మీలోని శక్తిని మేల్కొల్పుతుంది. ఇతరుల కోసం ఏ కొద్దిపాటి మంచి పనిచేసినా మీలో సింహానికున్నంత శక్తి- మీరు భరించలేనంత శక్తి ఉద్భవిస్తుంది. మీరు ఆశ్చర్య చకితులవుతారు.

- స్వామి వివేకానంద"

వసుధ హృదయంలో ఆనందపు ఊటలు.

●

## ప్రతిస్పందన

# దళిత జనాలు లేని 'జనకవనం'

ఈనెల 12న ఆదివారం 'వార్త'లో అచ్చయిన "అవగాహన విస్తృతికి జనకవనం" వ్యాసంలోని కొన్ని అవాస్తవాలను పాఠకుల ముందు ఉంచాలని ఈ ప్రయత్నం. ఆ వ్యాసంలో సాహిత్యంలో పదిమందికి ఉపకరించేవిధంగా సభలూ సమావేశాలు జరగాలనీ, విస్తృతమైన ప్రాతిపదికన సాహిత్య సదస్సులు జరగడం అరుదైపోయినకాలంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన జరిగిన 'జనకవనం' సాహిత్య సదస్సు విలక్షణమైందనీ వ్యాసకర్త కితాబు ఇచ్చారు. అయితే ఆ పదిమందిలో దళితులుగానీ, దళిత సాహిత్యంగానీ లేకపోవడం విస్తృత ప్రాతిపదిక ఎలా అవుతుందో వ్యాసకర్తకే తెలియాలి.

"తరచూ జరిగే సభలు సమావేశాల్లో తమ ముద్రకు ఆమోదయోగ్యులైన వారికి మాత్రమే ఆహ్వానాలుంటాయి. తాము గీసిన రేఖకు ఆవల వుండి మాట్లాడేవారికి అందులో చోటు వుండదు. మరోమాటలో చెప్పాలంటే తమ ఆలోచనా విధానాన్ని అంగీకరించి వచ్చినవారికి మాత్రమే సాహిత్య తరగతులు, వర్క్‌షాపులు నిర్వహిస్తారు. అంటే అంతా ఏకపక్షమే"- "వీటికి భిన్నంగా సాహితీ స్రవంతి నిర్వహించిన జనకవనం సదస్సు ప్రజాస్వామిక వాతావరణంలో విభిన్న దృక్పథాల వారికి వేదికగా నిలిచింది" అని కూడా రాసారు వ్యాసకర్త. అయితే కార్యాచరణలో 'జనకవనం'లో దళిత సాహిత్యానికిగానీ, దళిత సాహిత్య ప్రతినిధులకుగానీ చోటు లభించలేదు. బహుశా దళితులు లేకపోవడమే ప్రజాస్వామిక వాతావరణంగా సాహితీ స్రవంతి వారు భావించి వుంటారు. దళితుల పట్ల ఇతర సాహితీ సంస్థలు వ్యవహరించినట్లుగానే సాహితీ స్రవంతి కూడా వ్యవహరించిందని జనకవనం రుజువుచేసింది. తాము గీసిన రేఖకు ఆవల వుండి మాట్లాడే దళితులకు జనకవనంలో ప్రాతినిధ్యం లభించలేదు. జనకవనంలో పాల్గొన్న ప్రముఖులు చాలామంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మార్క్సిస్టు భావ జాలాన్ని ఆమోదించినవారూ, సమర్థించిన వారూ కాకపోతే సానుభూతిపరులు. ఇతర ప్రాంతాల నుండి కూడా వక్తలను ఆహ్వానించిన సాహితీ స్రవంతికి కనీసం హైదరాబాద్ నగరంలో వున్న దళిత సాహిత్యకారులు ఒక్కరు కూడా కనిపించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం.

సాహితీ స్రవంతి ఇటీవలనే జాషువాని స్మరిస్తూ సభ నిర్వహించింది. కానీ జనకవనం సభలకు మాత్రం దళితుల్ని ఎవర్నీ పిలవలేదు. అంటే జాషువాని మాత్రం గుర్తిస్తాం గానీ, ఇప్పటి దళిత సాహిత్యాన్ని గుర్తించబోమని చెప్పడమే దీని సారాంశమా? తెలుగు సాహిత్యానికి దళితవాదం అందిస్తున్న కంట్రిబ్యూషన్‌ని చూడ నిరాకరించడమే సాహితీ స్రవంతి ఉద్దేశం కావచ్చు. అందుకే భిన్న ప్రక్రియల్లో సాహిత్య సమ్మేళనం నిర్వహించిన సాహితీ స్రవంతి వారు ఏ ఒక్క దళిత రచయితనీ, కవినీ ఆహ్వానించలేదు. దళిత సాహిత్య ప్రస్తావన లేకుండా, దళిత సాహిత్యకారులకు చోటు లేకుండా ఇది ప్రజాస్వామిక వేదిక ఎలా అవుతుందన్నది ప్రశ్న.

దళితులు లేకుండా, దళిత సాహిత్యాంశాలు లేకుండా, దళిత సాహిత్య ప్రతినిధులు లేకుండా జరిగిన జనకవనం అవగాహనా విస్తృతికి ఏరకంగా, ఏమేరకు దోహదం చేస్తుందో నిర్వాహకులు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి!

**- దళిత సాహితీ మిత్రులు, హైదరాబాద్**